




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| సోమవారం 27 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 329 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## కవిత హింట్.. గ్రహించలేకపోయిన కేసీఆర్ , కేటీఆర్ !

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: టీఆర్ఎస్ పార్టీ పేరుపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. టీఆర్ఎస్ పేరు ప్రస్తుతం ఫ్రీగా ఉందని, దాన్ని ఎవరైనా వినియోగించుకోవచ్చని గతంలోనే కవిత పేర్కొన్న విషయం ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతరం బీఆర్ఎస్ పార్టీని తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే అంశం పరిశీలనలో ఉందని కేటీఆర్ ప్రకటించినప్పటికీ, ఆ దిశగా స్పష్టత రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కవిత ముందస్తుగా ఇచ్చిన సంకేతాలను పార్టీ ముఖ్య నాయకత్వం సరిగా అర్థం చేసుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కవిత టీం తెలంగాణ ప్రజా జాగృతి పేరును ప్రస్తావిస్తూ ముందుకు వచ్చినప్పటికీ, టీఆర్ఎస్ పేరుపై ఎక్కడా స్పష్టత ఇవ్వకపోవడం కూడా చర్చకు దారితీసింది. తాజా పరిణామాల నేపథ్యంలో టీఆర్ఎస్ పేరుపై కవిత ముందడుగు వేసినట్లుగా, రాజకీయంగా పైచేయి సాధించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.




## గుట్కా, డ్రగ్స్ వినియోగం ప్రాణహానికి కారణం: ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: గుట్కా, పాన్ మసాలా, డ్రగ్స్, ఖైనీ వంటి మాదక ద్రవ్యాల వినియోగం ప్రాణహానికి దారితీస్తుందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ అణచివేస్తోందని తెలిపారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రాయదుర్గం సత్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ మరాథాన్‌లో ఆయన 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. చెడు అలవాట్ల వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని, సమాజంలో అవగాహన పెంపు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ రమేష్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె. దిలీప్ కుమార్, వైద్యులు, ఐటీ ప్రొఫెషనల్స్, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సంక్షేమ నమూనా దేశానికి మార్గదర్శి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సందేశం టైమ్స్, చండీగఢ్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సామాజిక న్యాయం, సమగ్ర సంక్షేమం, బలహీన వర్గాల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చండీగఢ్‌లో నిర్వహించిన చింతన్ శివిర్–2026 సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "సమానత్వం–సాధికారత–స్వాభిమాన జీవితం" లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. దళితుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో సోషల్ వెల్ఫేర్ శాఖను ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా పునర్నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. విద్యా రంగంలో పోస్ట్ మ్యాట్రిక్, ప్రీ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్స్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, స్టడీ సర్కిల్స్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తున్నట్లు వివరించారు. ఎస్సీ హాస్టల్స్ ద్వారా లక్షలాది విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ లక్ష్మి, కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలు, రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఆర్థిక సాధికారత కల్పిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం పింఛన్లు, క్లినిక్స్, శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ పాలన ద్వారా పారదర్శకతను పెంచుతూ DBT విధానంలో నిధులు నేరుగా లబ్ధిదారులకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంక్షేమ నమూనా కేవలం పథకాల అమలు కాకుండా సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనంగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు.




## ప్రజావాణి వ్యవస్థను క్షేత్రస్థాయికి విస్తరించాలి: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించిన సీఎం, 2023 డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రారంభించిన ఈ కార్యక్రమం అప్పటి నుంచి ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిభా ఫూలే ప్రజా భవన్‌లో కొనసాగుతోందని, అదే విధంగా జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్ లేదా జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండా ప్రజావాణిని రెవెన్యూ డివిజన్ స్థాయికి వెంటనే విస్తరించాలని, తరువాత దశలో మండల స్థాయికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార పురోగతిని అర్జీదారులకు తెలియజేయాలని, నిర్ణీత గడువుల్లో పరిష్కారం జరగాలని, ఆలస్యం సహించరాదని స్పష్టం చేశారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని, రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని, అవసరమైతే ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రజావాణి సేవలు ప్రజలకు నమ్మకంగా ఉండేలా పని చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇదే సందర్భంలో జూబ్లీహిల్స్‌లో జరిగిన జనగణన–2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి వెబ్‌సైట్ ద్వారా తన వివరాలను స్వయంగా నమోదు చేసి, జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు

## సెన్సస్–2027లో పాల్గొని విజయవంతం చేయండి: సీ.ఎస్ రామకృష్ణారావు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సెన్సస్–2027లో భాగంగా ప్రారంభమైన సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదివారం పాల్గొని తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. ఆయన తన నివాసంలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసి తెలంగాణలో సెన్సస్ ఆఫ్ ఇండియా–2027 కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తప్పనిసరిగా లెక్కలో చేరేందుకు ముందుకు వచ్చి స్వీయ గణనలో పాల్గొని సెన్సస్–2027ను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

## సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా జీ. ముకుంద రెడ్డి బాధ్యతల స్వీకరణ



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా జీ. ముకుంద రెడ్డి నేడు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రత్యేక కమిషనర్‌గా ఉన్న సిహెచ్ ప్రియాంకను బదిలీ చేయడంతో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన ముకుంద రెడ్డిని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు ఆయన సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌తో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా కూడా బాధ్యతలను స్వీకరించారు.

## దాన కిషోర్, ప్రియాంక అలా సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సమావేశం





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దాన కిషోర్, హైదరాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక అలా నేడు సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎస్‌తో పరిపాలనా అంశాలు, శాఖల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర విషయాలపై చర్చించారు. రాష్ట్రంలో పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు.




## జనగణన-2027లో స్వీయ గణనకు నేటి నుండి అవకాశం

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 27, ప్రతినిధి: జిల్లాలో జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన ప్రక్రియకు అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు ఈ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని, ప్రజలు తమ కుటుంబ వివరాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈసారి జనగణనలో స్వీయ గణన విధానం ప్రవేశపెట్టడం డిజిటల్ దిశగా ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు.

- స్వీయ గణన ముఖ్యాంశాలు:

కుటుంబాలు తమ వివరాలను స్వయంగా ఆన్లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం
మొబైల్ నంబర్, ఓటీపీ ఆధారంగా సురక్షిత ప్రక్రియ
నివాస స్థలాన్ని డిజిటల్ మ్యాప్‌లో ఖచ్చితంగా గుర్తింపు
సులభమైన ప్రశ్నలు, సహాయం కోసం సూచనలు అందుబాటులో
నమోదు పూర్తయ్యాక ఎస్ఈ ఐడీ పొందే అవకాశం

- ఎన్యూమరేటర్ పాత్ర:

స్వీయ గణన చేసినా గృహ సందర్శన తప్పనిసరి
ఎస్ఈ ఐడీ ఆధారంగా వివరాల పరిశీలన, సవరణలు
యాప్ ద్వారా డేటా ధృవీకరణ
నమోదు చేయని కుటుంబాల వివరాలను స్వయంగా నమోదు

- ప్రజలకు సూచనలు:

ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశంలోనే వివరాల నమోదు
లొకేషన్ మ్యాపింగ్ ఖచ్చితంగా చేయాలి
ఒక మొబైల్ నంబర్‌తో ఒకే కుటుంబం నమోదు
ఫైనల్ సబ్మిట్ ముందు వివరాలు పరిశీలించాలి
తప్పు సమాచారం ఇవ్వకూడదు

పోర్టల్‌లో లాగిన్ అయి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేసి, నివాస స్థలాన్ని సరిగ్గా గుర్తించి వివరాలు నమోదు చేయాలని, సమర్పణ అనంతరం లభించే ఎస్ఈ ఐడీని భద్రపరచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా స్వీయ గణనలో పాల్గొని ఖచ్చితమైన జనగణనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాసవి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహణ



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 27, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తెలిపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ముఖ్య అతిథిగా హాజరైన పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాసవి మాత త్యాగాన్ని గుర్తించి ఈ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాసవి మాత స్ఫూర్తితో అహింస, ధర్మ మార్గాల్లో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాసవి అమ్మవారు చూపిన అహింస, ధర్మ మార్గాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మురిసెట్టి నివేదిత మాట్లాడుతూ వాసవి అమ్మవారి ఆశీస్సులతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతల స్వీకరణ





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, ఐఏఎస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారుల సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పరిపాలనపై సమీక్ష నిర్వహించి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో వాసవి మాత 4644వ జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత 4644వ జయంతి వేడుకలను సంగారెడ్డి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తోపాజీ అనంత కిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పుట్లూరీ ప్రకాష్, ఎం. రాధాకిషన్, జె. బుచ్చిలింగం, జె. మల్లేశం, ఆర్. విజయలక్ష్మి (కలెక్టరేట్ సూపరింటెండెంట్) తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా వాసవి మాత త్యాగం, అహింస, ధర్మ మార్గాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది తమ వంతు సహకారం అందించారు. ఈ విషయాన్ని జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి టి. అఖిలేష్ రెడ్డి తెలిపారు.

## సంగారెడ్డిలో ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలో వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ అతిథి గృహం వద్ద జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా, కొత్త బస్టాండ్, కలెక్టరేట్ మీదుగా పాత బస్టాండ్ నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. జై వాసవి జై జై వాసవి నినాదాలతో పట్టణం మారుమోగింది. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా ప్రకటించడంతో కలెక్టరేట్‌లో కూడా వేడుకలు నిర్వహించి వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండ్ విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో కొప్పుల శేషారెడ్డి పాల్గొనడం



సందేశం టైమ్స్, మెదక్/అల్లాదుర్గం, ఏప్రిల్ 27, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండల పరిధిలోని రెడ్డిపల్లి, ముప్పారం గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలకు అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. రెడ్డిపల్లిలో చెన్నబోయిన మల్లమ్మ-మల్లయ్య, ముప్పారంలో ఏర్రోళ్ల శివానీలా-నాగరాజ్ కుటుంబాల ఇళ్ల గృహప్రవేశాలను ఆయన చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత: కలెక్టర్ ప్రతిమా సింగ్




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 27, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు ప్రతి సంవత్సరం వాసవి మాత జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. సమాజానికి అహింస, ధర్మ మార్గాలను చూపిన మహనీయురాలిగా వాసవి మాతను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రమేష్, డీపీఆర్వో రామచంద్రరాజు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బుక్క అశోక్, కోశాధికారి మరుమల్ల అశోక్, ఉత్సవ కమిటీ చైర్మన్ రాయకంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మే డే వారోత్సవాలను విజయవంతం చేయాలి: చుక్క రాములు పిలుపు




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 27, ప్రతినిధి: కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. మే 1 నుండి 7 వరకు నిర్వహించే మే డే వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. మెదక్ కేవల్ కిషన్ భవనంలో సీఐటీయూ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు బి. బాలమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ అమలు చేయడం కార్మికుల హక్కులను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. బ్రిటిష్ కాలం నుండి పోరాటాల ద్వారా సాధించిన 29 రకాల కార్మిక చట్టాలను తొలగించడం సరికాదని విమర్శించారు. మే డే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎం. అడివయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు, కార్మిక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షణ




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 27, ప్రతినిధి: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో శీలం బాలరెడ్డి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు 'మన్ కీ బాత్' ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, సర్పంచులు ఆకుల రమేష్, యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షులు భాను చందర్, కౌన్సిల్ అభ్యర్థి సత్యం, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ఆవుల రాజిరెడ్డి





సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 27, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం పంబండ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లను నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. అనంతరం పంబండ, ఉసిరికపల్లి, హంసన్‌పల్లి, వెంకటాపూర్, దేవులపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్





సందేశం టైమ్స్, మెదక్/అల్లాదుర్గం, ఏప్రిల్ 27, ప్రతినిధి: అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామానికి చెందిన పడమటి శంకరయ్య-సత్తెమ్మ దంపతుల కుమారుడు కానిస్టేబుల్ యాదగిరి, మనిషా వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చేవెళ్ల కాశీనాథ్, జైపాల్, మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సిలు, మాజీ ఉపసర్పంచ్ నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరు లాడ్జిలో మహిళ హత్య కలకలం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, టౌన్ రిపోర్టర్ వి సాయి: పటాన్చెరు పరిధిలోని చందానగర్ నైట్ ఐ లాడ్జిలో మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. మృతురాలు ఇంద్రేశం నివాసి నరసమ్మ (39)గా గుర్తించారు. నిన్న మధ్యాహ్నం మరో వ్యక్తితో కలిసి లాడ్జ్‌కు వెళ్లిన ఆమెను చున్నీతో గొంతు బిగించి హత్య చేసి దుండగుడు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఉదయం హోటల్ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# బోరంచలో శ్రీ నల్లపోచమ్మ జాతర ప్రారంభం

సందేశం టైమ్స్, మనూర్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలం బోరంచ గ్రామ శివారులో మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో ఏడు ఆదివారాల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి ఆదివారం సందర్భంగా అర్చకుడు సిద్ధు స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకునే ఈ ఆలయం విశేష ప్రాముఖ్యత కలిగిఉందని తెలిపారు. అమ్మవారికి మొక్కులు పెట్టుకుంటే తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. మహోత్సవాల ప్రారంభంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

# పోలీసు కార్యాలయంలో వాసవి మాతకు ఘన నివాళులు






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ డానియెల్ మాట్లాడుతూ వాసవి మాత జీవితం శాంతి, అహింస, ధైర్యం, త్యాగం, సమానత్వం వంటి ఉన్నతమైన విలువలకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఆమె చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శమని, ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ విలువలను తమ దైనందిన జీవితంలో ఆచరిస్తే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వాసవి మాత ఆశీస్సులు అందరికీ లభించాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాసవి మాత జయంతి ఘనంగా

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వాసవి మాత జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తాసిల్దార్ రాజు పటేల్, డిప్యూటీ తాసిల్దార్ ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారిణి ఉమా హారతి ఆదేశాల మేరకే ఈ జయంతి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# వట్‌పల్లిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటానికి పాలాభిషేకం



సందేశం టైమ్స్, వట్‌పల్లి, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ₹1.90 కోట్ల నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటానికి సర్పంచ్ రవీందర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. మండల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని, గ్రామాల అభివృద్ధికి ఇది కీలకంగా నిలుస్తుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అభివృద్ధి కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బాగ్గీ ఇస్మాయిల్, యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, NSUI నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా, కాంగ్రెస్ నాయకులు దిగంబర్ రావు, కుతుబ్, పాండు రావు, బసిరెడ్డి, యాదయ్య, మొహిన్, సుబుద్ధి, వాసు గౌడ్, అరవింద్ రెడ్డి, మహాలింగం, సాయి కుమార్, అభిలాష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో భూలక్ష్మి అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొనడం



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం తుర్కపల్లి గ్రామంలో వైభవంగా జరుగుతున్న శ్రీ భూలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జాతరను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ విఠల్, గ్రామ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, ఉప సర్పంచ్ లలిత దుర్గా గౌడ్, ఏల్గోయి గ్రామ సర్పంచ్ శివాజీ రావు పాటిల్, ఉప సర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


## అనంతగిరి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ – సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఆర్. శ్రీనివాస్ రెడ్డి సందర్శన





సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 27, ప్రతినిధి: కోదాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఆర్. శ్రీనివాస్ రెడ్డి వార్షిక తనిఖీ సందర్భంగా అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో పోలీస్ పరేడ్ నిర్వహించి వారి కిట్లను తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసు ఫైళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణపై సిబ్బందికి తగు మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ఎస్సై ఎం. నవీన్ కుమార్, ఏఎస్ఐ సి.హెచ్. లింగారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు జె. రమేష్, డి. లక్ష్మయ్య, పి. సాగర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## బాలల భద్రత–మాదకద్రవ్య వ్యతిరేక సంక్షేమ వారం పటిష్టంగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్


సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 27, ప్రతినిధి: ఈనెల 27వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్న బాలల భద్రత, రక్షణ మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారోత్సవాలను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మెదక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పోలీస్ మరియు వివిధ సంక్షేమ శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించిన ఆమె, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ వారోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. 27న శిశు సంరక్షణ సంస్థల్లో స్పోర్ట్స్ కిట్ల పంపిణీ, 28న బాల్య వివాహాలు, కౌమార గర్భాలు, బాలల రక్షణపై అవగాహన స్నేహ్ గ్రూప్ సమావేశాలు, 29న సైబర్ నేరాలపై అవగాహన మరియు గ్రామ బాలల రక్షణ కమిటీ సమావేశాలు, 30న దత్తత కార్యక్రమం మరియు అవగాహన కార్యక్రమాలు, మే 1న బాల్ భరోసా కార్యక్రమం ద్వారా 0–5 సంవత్సరాల పిల్లల అభివృద్ధి స్క్రీనింగ్, 2న మత్తు పదార్థాల దుర్వినియోగ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ వారోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, అధికారులు సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, జై చంద్రారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## న్యాలకల్‌లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా




సందేశం టైమ్స్, న్యాలకల్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాలకల్ మండలం రాంతీర్థ్ గ్రామంలో భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ నూతన విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్ ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో అంబేద్కర్ అట్టడుగు స్థాయి నుంచి ప్రపంచ మేధావిగా ఎదిగిన జీవితం నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, న్యాలకల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, PACS చైర్మన్ సిద్దిలింగయ్య, మాజీ జడ్పీటీసీ చంద్రప్ప, రాంతీర్థ్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్‌సన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశం ఘనంగా



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని కన్‌సన్‌పల్లి గ్రామంలో సంతోష–మొగులయ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ సునీతమ్మ మైపాల్ రిబ్బన్ కట్ చేసి ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు సొంతింటి కల నిజమవుతుందని, లబ్ధిదారులు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలో వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ అతిథి గృహం వద్ద జెండా ఊపి ప్రారంభించిన బైక్ ర్యాలీ కొత్త బస్టాండ్, కలెక్టరేట్, పాత బస్టాండ్ మీదుగా వాసవి ఆలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు "జై వాసవి.. జై జై వాసవి" అంటూ నినాదాలు చేశారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వాసవి జయంతిని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కూడా వేడుకలు నిర్వహించి వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్, కార్యదర్శి నామా భాస్కర్, కోశాధికారి జూలకంటి మల్లేశం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పుల్లూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## RTE అమలు చేయాలి: పాలకులపై తీన్మార్ మల్లన్న విమర్శలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 27, ప్రతినిధి: చట్టాలను అటకెక్కించి సామాన్యులను మోసం చేస్తున్న పాలకులు విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని, వెంటనే RTE (Right to Education) చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శించారు. విద్య అందరికీ సమానంగా లభించాల్సిన అవసరం ఉందని, కులమతాలకు అతీతంగా నాణ్యమైన ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీసీల ప్రభుత్వం వస్తుందని, ఆ ప్రభుత్వంలో ప్రతి పేద బిడ్డకు ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తామని ఆయన తెలిపారు. విద్య కోసం తల్లులు ఆభరణాలు తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి ఇక ఉండదని, నిజాయితీతో ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెడతామని ఆయన అన్నారు.

## సంగారెడ్డి కలెక్టరేట్‌లో వాసవి మాత 4644వ జయంతి వేడుకలు ఘనంగా



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత 4644వ జయంతి వేడుకలు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పుల్లూరి ప్రకాష్, ఎం. రాధాకిషన్, జె. బుచ్చిలింగం, జె. మల్లేశం, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఆర్. విజయలక్ష్మి తదితరులు పాల్గొని వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా యువజన మరియు క్రీడా అధికారి టి. అఖిలేష్ రెడ్డి సమన్వయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో ప్రజాదర్బార్ – సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి ఆదేశాలు




సందేశం టైమ్స్, పాలేరు, ఏప్రిల్ 27, ప్రతినిధి: ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చినప్పుడు ప్రజా సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలనే దృక్పథంతో పనిచేసే నాయకులు కొద్దిమంది మాత్రమే ఉంటారని, అందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒకరని స్థానికంగా అభిప్రాయం వ్యక్తమైంది. ఈరోజు నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి ప్రజల సమస్యలను స్వయంగా విని, అధికార యంత్రాంగాన్ని వెంటపెట్టుకుని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ, ప్రాంత సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా సాగిన ఈ ప్రజాదర్బార్ పాలేరు నియోజకవర్గ ప్రజలకు భరోసాను కల్పించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ విధానం ఆదర్శంగా నిలవనుందని మంత్రి తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.